ప్రజల ఆశీస్సులతోనే హ్యాట్రిక్ విజయం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజల ఆశీస్సులతోనే హ్యాట్రిక్ విజయం సాధ్యపడిందని.. ఇది ప్రజా విజయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా శుక్రవారం సూరారం డివిజన్‌లోని లక్ష్మీనగర్, అయ్యప్ప సొసైటీ, సూరారం గ్రామం, విశ్వకర్మకాలనీలలో ఎమ్మెల్యే పర్యటించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు, శాలువలతో సత్కరించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. గతంలో తాను చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు తనను ఆదరించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, సిద్దిక్, మన్నె బాలేష్, సాయిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్, సీసాల బస్తీలలో పల్లె దవాఖానా, షాపూర్‌నగర్ సబ్ మేళా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 73 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. డాక్టర్లు గీత, లలిత, ఆశావర్కర్లు, నాయకులు జైహింద్, మహమ్మద్ ఆజీ, సువర్ణ, జంద్రకళ, శివరంజని, విగ్నేష్ పాల్గొన్నారు.

ఆలింగం చేసుకుని గొలుసుతో చెక్కేశాడు

జగద్గిరిగుట్ట: బైక్‌పై వచ్చాడు.. హాయ్ అంటూ అలింగనం చేసుకుని వెళ్లిపోయాడు. తీరా అతడు వెళ్లిపోయాక చూసుకుంటే మెడలో గొలుసు కనిపించలేదు. ఈ ఘటనతో బాధితుడు ఒక్కసారిగి కంగుతిన్నాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం ఇందిరానగర్‌కు చెందిన సంగారెడ్డి శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే వాకింగ్‌కు వెళ్లాడు. ఉదయం 6గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి తెలిసిన వ్యక్తివలే హాయ్ అంటూ పలకరించి అలింగనం చేసుకున్నాడు. సంగారెడ్డి అతను ఎవరు అంటూ ఆలోచించేలోగా మెడలో గొలుసు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారు గొలుసు 1.5తులాలు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రంగారెడ్డినగర్‌లో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు మల్లారెడ్డి



యువజన దినోత్సవం

మీ స్ఫూర్తి అమరం..

మీ ప్రసంగాలు అజరామరం

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

మందలో ఒకడిగా ఉండకు.. వందలో ఒకడిగా ఉండటానికి ప్రయత్నించు! కేరటం నా ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు.. పడినా లేస్తున్నందుకు.! లేవండి... మేల్కొనండి.. మీ గమ్యం చేరే వరకు విశ్రమించకండి.! నేను ఏమీ చేయలేను.. నా వల్ల కాదు.. ఈ సమాజం ఇంతే అనుకుంటూ నిరాశ నిస్పృహలో ఉండే వారిలో అనుకున్నది సాధించాలనే ఆశను రేకెత్తిస్తాయి స్వామి వివేకానంద చేసిన ప్రసంగాలు. **ఇనుప కండలు.. ఉక్కు నరాలు.. వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి ఎంతో అవసరం!** అంటూ స్వామి వివేకానంద యువతను మేల్కొల్పడానికి ఎన్నో ప్రసంగాలు చేసి యువతకు మార్గదర్శిగా నిలిచారు. అందుకే భారత ప్రభుత్వం స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించింది. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, మేధావులు



సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులపర్పించారు. ప్రపంచానికి భారతదేశ గొప్పదనాన్ని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు.

– కుత్బుల్లాపూర్



స్వామి వివేకానంద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే వివేకానంద్



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రంగారెడ్డినగర్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'ఫేర్‌వెల్ టు ఫియర్' అనే అంశంపై సీనియర్ రాజయోగటీచర్, కార్పొరేట్ ట్రైనర్ బీకె అంజలి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

హఫీజ్‌పేట్‌లో రామయ్య అక్షింతల వితరణ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో శ్రీ అయోధ్య రామయ్య అక్షింతలు వితరణ శుక్రవారం శ్రీ హనుమాన్ మందిరం నుంచి హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామభక్తులతో కలిసి బోయిని అనుషా మహేష్ యాదవ్, గ్రామస్తులు కలిసి ఇంటింటికి తిరుగూ అయోధ్య రామయ్య అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బోయిని మహేష్ యాదవ్, యాదగిరి గౌడ్, నరేందర్, గౌతమ్, మల్లేష్, జితేందర్, వెంకటేష్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిర్లా ప్లానిటోరియం సందర్శన

రాయదుర్గం: నగరంలోని బిర్లా ప్లానటోరియంను గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. 'పీఎం శ్రీ ప్రోగ్రామ్' కింద విద్యార్థులకు జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని విద్యాలయ నుంచి ప్రత్యేక వాహనాల్లో ప్లానిటోరియంను చేరుకొని అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. దాని ప్రత్యేకత వివిధ అంశాలపై తమకున్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రొఫెసర్‌కు జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్

రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ వినోద్ పవరాలకు అరుదైన గౌరవం లభించింది. క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయంలో 2024 జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్‌ను పొందారు. బ్రిస్బేన్ లోని స్కూల్ కమ్యూనికేషన్‌లోని స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్ జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్–2024కు ఆయన ఎంపికయ్యారు.

రక్తదానం అన్ని దానాల కంటే మిన్న

రాయదుర్గం: రక్తదానం అన్ని దానాల కంటే మిన్న అని, యువత రక్తదాన చేయడానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. బీజేవైఎం శేరిలింగంపల్లి నాయకుడు అమర్ యాదవ్ ఆధ్వర్యంలో రాయదుర్గంలో రక్తదాన శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు రక్తదాతలను అభినందించారు. ఆతర్వాత మాట్లాడుతూ ప్రతియేటా ఔత్సాహిక యువత రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని, భయం వీడాలని సూచించారు.

ఆకట్టుకున్న 'పాటరీ మేకింగ్' వర్క్‌షాప్

రాయదుర్గం: విద్యార్థులను చదువుతోపాటు ఇతర రంగాలలో రాణించేలా చేయడంలో కేంద్రీయ విద్యాలయాలు ఎంతో కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా పీఎంశ్రీహ్యాండ్స్ కార్యక్రమం కింద 'పాటరీ మేకింగ్ వర్క్‌షాప్'ను శుక్రవారం గచ్చిబౌలి జీపీఆర్ఏక్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుండల తయారీలో నిష్ణాతుడైన జయప్రకాశ్ వావిలాల ఆధ్వర్యంలో విద్యాలయలో 6వ తరగతి ఏ,బీ,సీ సెక్షన్లకు చెందిన 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మట్టితో వివిధ ఆకృతులను తయారీ చేసి విద్యార్థులకు ఆయన చూపించారు. అనంతరం విద్యార్థుల చేత కూడా మట్టితో వివిధ ఆకృతులను తయారు చేసేలా ఆయన ప్రోత్సహించారు.

కబ్జాదారుల బరితెగింపు



సుభాష్‌నగర్‌లో కబ్జాచేసి నిర్మాణం

- ఏకంగా నాలా బఫర్ జోన్‌ను కబ్జాచేసున్న వైనం
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి హస్తం ఉన్నట్లు ఆరోపిస్తున్న స్థానికులు

జీడిమెట్ల: అదును చూసి కబ్జాదారులు బరితెగించి నిర్మాణాలు చెపడుతున్నారు. కబ్జాదారులు నుంచి ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు తమకేం తెలియదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ జాగాలు కాపాడటంలో విఫలం అవుతున్నారు. ప్రభుత్వ స్థలాలు కాపాడలేని ప్రభుత్వ అధికారులు అవసరమా? అని సుభాష్‌నగర్ ప్రజలు కన్నెర్ర చేస్తున్నారు. ఫాక్స్‌సాగర్‌కు చెందిన నాలా సుభాష్‌నగర్ గుండాపోతుంది. 30ఫీట్ల వెడల్పు ఉన్న కాలువకు ఇరు పక్కల 10ఫీట్ల మేర బఫర్‌జోన్ స్థలం ఉంది. సదరు స్థలంపై కబ్జాదారులు కన్నుపడింది. ఇక అంతే జాగా తమదే అంటూ బరితెగించి నిర్మాణం చేపట్టారు.

ప్రభుత్వ స్థలాన్ని ఎందుకు కాపాడలేకపోతున్నారు..?

ప్రభుత్వ స్థలాలను అధికారులు కాపాడటంలో ఎందుకు విఫలం అవుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులే దగ్గర ఉండి వారికి తెలిసిన వారితో సుభాష్‌నగర్ నాలా పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ జాగాను కబ్జా చేయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పనిచేసే ఓ ఉద్యోగి ఈ తతంగమంతా నడిపిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

నేరుగా ఫిర్యాదు చేసినా ఫలితం సున్నా..

సుభాష్‌నగర్‌లోని నాలా కబ్జాపై స్థానికంగా ఉన్న ప్రజలు పలుమార్లు రాతపూర్వకంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే ఈ విషయంపై నేరుగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, సీఎం క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదులు చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ముందుంటా



కుత్బుల్లాపూర్: సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల వాసులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం విశాలాంధ్ర దినపత్రిక నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్సీ రాజు ఆవిష్కరించారు.

ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

మాదాపూర్: వ్యక్తిగత కారణాల వల్ల ఓ ఐటీ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజ్ తెలిపిన మేరకు.. మాదాపూర్‌లోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న జగదీశ్(23) స్నేహితులతో కలసి ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఉదయం 9.30గంటలకు తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కబ్జా చెరలో ఎర్ర గోడలు!



ఐడీపీఎల్ - జగద్గిరిగుట్ట రహదారిలో ఉన్న ఎర్రగోడలు



ఎర్ర గోడలను ఆనుకుని టీస్టాల్

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఎర్రగోడలు అంటే తెలియని వారు ఉండరు. దాదాపు అర్ధ శతాబ్ద చరిత్ర గల ఈ గోడలు ప్రస్తుతం కబ్జాల చెరలో చిక్కుకున్నాయి. 1978 సంవత్సరంలో గాంధీనగర్‌లోని పారిశ్రామికవాడ ఏర్పాటు చేయగా అప్పట్లో కార్మిక ఐక్యతకు సూచికగా ఐడీపీఎల్ చౌరస్తా నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలో నిర్మించిన ఎర్రగోడలను అప్పటి కార్మికశాఖ మంత్రి ప్రారంభించారు.

◆ మే డే ఉత్సవాలు, కార్మికులకు సంబంధించిన కార్యక్రమాలను ఎర్రగోడల సమీపంలోనే నిర్వహించేవారు. కాని రాను రాను ఎర్రగోడల నిర్వహణ విషయంలో కార్మిక సంఘాలు పట్టించుకోకపోవడంతో ఇదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు ఎర్రగోడలను ఆనుకుని టీస్టాల్, పూల దుకాణం ఏర్పాటు చేశారు. టీస్టాల్ నిర్వహణతో ఎర్ర గోడలు మసిబారి రూపురేఖలు కోల్పోతున్నాయి. అంతే కాకుండా ఎర్రగోడలపై



ఎర్రగోడల పక్కనే పూల దుకాణాలు

పోస్టర్లు అంటిస్తున్నారు. సమీపంలోనే ఏఐటీయూసీ కార్యాలయం ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

◆ ఎర్రగోడలను ఆనుకుని వెలిసిన అక్రమణల విషయంలో కొందరు కార్మిక సంఘాల నాయకుల దుకాణదారుల చేతివాటం ప్రదర్శిస్తూ నెలవారీ వసూళ్లకు పాల్పడున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఏదీ ఏమైనా చారిత్రకమైన ఎర్రగోడలను ఇప్పటికైనా కార్మిక సంఘాలు పట్టించుకుంటాయో లేక తమకెందుకులే అనే ధోరణిలో వదిలి వేస్తారో అనేది వేచి చూడాలి.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయి



ఠాగూర్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రంగారెడ్డినగర్: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ ఠాగూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్ట్ వాడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై తమ తల్లిదండ్రులతో పాటు చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించాలని ఏసీపీ సూచించారు.

ఇందిరా గాంధీ విగ్రహ ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలో ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం గతేడాది జూన్ 18న టిప్పర్ ఢీకొట్టడంతో ధ్వంసమైంది. కాగా అదే స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని శుక్రవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ నర్సారెడ్డి భూపతిరెడ్డి, సీనియర్, మహిళా, యువజన, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

మేయర్‌కు రామయ్య అక్షింతలు



మేయర్ నీలారెడ్డికి అక్షింతలు అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌కు రెండోసారి స్వచ్ఛ సర్వేక్షణ్–2023 అవార్డు వచ్చిన నేపథ్యంలో మేయర్ నీలారెడ్డికి అభిందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర సభ్యులు మేయర్‌ను కలిసి శ్రీరాముడి చిత్రపటంతో పాటు అక్షింతలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాము, గణేష్, శ్రీకాంత్, సంతోష్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్‌లో అక్షంతల పంపిణీ

పండగ ముందే వచ్చేసింది.!



సాంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వెంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్‌లో గంగిరెద్దుతో కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు హరిదాసుల వేషధారణలో సందడి చేశారు. పాఠశాల ఆవరణలో భోగిమంటలు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు వారి తల్లులు రంగవల్లులను ఆకర్షణీయంగా వేశారు. సంక్రాంతి విశిష్టతను వివరిస్తూ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

– కుత్బుల్లాపూర్



వెన్నెలగడ్డ సెయింట్ ఆంథోనీస్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో నృత్య ప్రదర్శనలు



షాపూర్‌నగర్ క్యాపిటల్ డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



జగద్గిరిగుట్ట శ్రీచైతన్య విద్యానికేతన్‌లో ముగ్గుల పోటీల దృశ్యం



చింతల్ శ్రీవిద్యా జూనియర్ కళాశాల వద్ద ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



బీవీఆర్ఐటీ మహిళా కళాశాలలో భోగి మంటలు వేసిన అధ్యాపకులు



ప్రగతినగర్ నారాయణ స్కూల్‌లో ముగ్గుల పోటీలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029